ముమ్మరంగా ఉపాధి పనులు

- లక్ష్యాలను అధిగమించి పనులు
- గిట్టుబాటు కాని కూలి
- సకాలంలో అందని వేతనాలు
- రైతుల పొలాల్లో ఉచితంగా నీటి ఊట కుంటల తవ్వకం


నల్లజర్ల మండలం పోతవరంలో రైతు పొలంలో ఉపాధి హామీ పథకంలో తవ్వుతున్న చిన్న నీటి ఊట కుంట

దేవరపల్లి: గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పొగాకు, వరి కోత పనులు ముగియడంతో ఉపాధి పనులకు కూలీలు మొగ్గు చూపుతున్నారు. నాలుగు నెలలు మందకొడిగా కొనసాగిన పనులు ఈ నెలలో వేగం పుంజుకున్నాయి. రోజురోజుకూ పని దినాలు పెరుగుతున్నాయి. పంట బోదెల తవ్వకం, చిన్న సన్నకారు రైతుల పొలాల్లో నీటిని నిల్వ చేసుకోవడానికి చిన్న నీటి ఊట కంటల తవ్వకం, చెరువుల్లో పూడికతీత పనులు, రోడ్ల వెంబడి ఉన్న ముళ్ల పొదలను తొలగించడం, పండ్ల తోటల పెంపకం వంటి పనులు ఉపాధి హామీ పథకంలో చేపట్టారు. ఉపాధి పనులు వృద్ధులు, దివ్యాంగులతో పాటు వ్యవసాయ కూలీలకు జీవనోపాధి కల్పిస్తున్నాయి. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలను ఉపాధి హామీ ఆదుకుంటోంది.

కుటుంబానికి 100 రోజుల పని

ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు గల కుటుంబానికి ఏడాదికి వంద రోజులు పని దినాలు కల్పిస్తున్నారు. ఏటా ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31 వరకు వంద పనిదినాలు ప్రభుత్వం కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజుకు రూ.307 వేతనం చెల్లించాల్సి ఉంది. అయితే రూ.150 నుంచి రూ.200 వేతనం వస్తోందని కూలీలు వాపోతున్నారు. చేసిన పనిని బట్టి వేతనం వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఏడాదికి వంద రోజుల పనిదినాలు సరిపోవడం లేదని, 120 రోజులు చేయాలని కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో ప్రస్తుతం రోజుకు 13,700 పనిదినాలు కల్పిస్తున్నారు. దేవరపల్లి మండలంలో 3,500 మంది, నల్లజర్ల మండలంలో 4,500 మంది, గోపాలపురం మండలంలో 5,700 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు.

లక్ష్యానికి మించి పనులు

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి పనులు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మూడు మండలాల్లో నూరు శాతం పనులు పూర్తి చేశామన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూరు శాతం పనులు పూర్తి చేయడానికి ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్టు అధికారులు చెపుతున్నారు. దేవరపల్లి మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 49 వేల పనిదినాలు కల్పించామన్నారు. నల్లజర్ల మండలంలో 4 లక్షల పని దినాలు లక్ష్యం కాగా ఇప్పటికి 72 వేల పని దినాలు, గోపాలపురం మండలంలో 5.30 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1.20 లక్షల పనిదినాలు కల్పించినట్టు అధికారులు తెలిపారు.

వేతనాల కోసం ఎదురు చూపులు

చేసిన పని దినాలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో కూలి డబ్బుల కోసం కూలీలు వారాల తరబడి ఎదురు చూస్తున్నారు. దాదాపు మూడు నెలల పెండింగ్ వేతనాలను ఇటీవల అధికారులు కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఏప్రిల్ నెల ఒకటి నుంచి ఇప్పటి వరకు సుమారు ఎనిమిది వారాల వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని ఉపాధి పనులు చేసిన కూలీలు వాపోతున్నారు. వారాల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఇల్లు గడిచేది ఎలా అని కూలీలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

కూలి గిట్టుబాటు కావడం లేదు


ఉపాధి కూలీ గిట్టుబాటు కావడం లేదు. రోజుకు రూ. 307 ఇస్తున్నట్టు అధికారులు చెపుతున్నారు. కానీ రూ.150 నుంచి రూ.200 కూలి రావడం లేదు. ఆరు వారాలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నాం. కిరాణా దుకాణాల వద్ద బాకీలు పెరిగితున్నాయి. చేసిన పనికి ప్రతి వారం వేతనాలు చెల్లించాలి.
– గెద్దం సీతమ్మ, ఉపాధి కూలి, గౌరీపట్నం, దేవరపల్లి మండలం

పని దినాలు పెంచాలి


ప్రభుత్వం కల్పిస్తున్న పనిదినాలు సరిపోవడం లేదు. ఏడాదికి కుటుంబానికి 100 రోజులు పని కల్పిస్తున్నారు. ఏడాదికి 150 రోజులు పని దినాలు కల్పించాలి. వేతనం రోజుకు రూ.307 చెల్లించాలి. తొమ్మిది వారాలుగా కూలీ డబ్బులు ఇవ్వడం లేదు. ఇంట్లో గడవక ఇబ్బంది పడుతున్నాం. గ్రామంలో చెరువు పనులు, పంట బోదెల తవ్వకం పనులు చేస్తున్నాం. వారానికి రూ. 1000 వస్తున్నాయి.
– గెద్దం కృపారావు, ఉపాధి కూలి, గౌరీపట్నం

సకాలంలో వేతనాలు ఇవ్వాలి


తొమ్మిది వారాల నుంచి పనులు చేస్తున్నాను. ఇప్పటి వరకు వేతనాలు అందలేదు. ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనిచేస్తే రోజుకు రూ. 150 నుంచి రూ.160 కూలి వస్తుంది. సకాలంలో వేతనాలు ఇవ్వడంలేదు. పనుల వద్ద కనీస సౌకర్యాలు లేవు. కనీస వేతనం రోజుకు రూ. 307 చెల్లించాలి.
– దిద్దే వీరయ్య, ఉపాధి కూలి, గౌరీపట్నం

కూలీల సంఖ్య పెరుగుతోంది


ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెరుగుతోంది. మెట్ట ప్రాంతంలో పొగాకు పనులు పూర్తి కావడంతో ఉపాధి పనులు వేగం పుంజుకున్నాయి. మార్చి వరకు వేతనాలు చెల్లించాం. ఏప్రిల్ నెల నుంచి వేతనాలు విడుదల కావలసి ఉంది. పనుల వద్ద మంచి నీటి సదుపాయం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నాం. ఏడాదికి 100 రోజులు పనిదినాలు కల్పిస్తున్నాం. ప్రతి రోజు పనులను పర్యవేక్షించి అవగాహన కల్పిస్తున్నాం.
– ఎస్. వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ, దేవరపల్లి

క్లుప్తంగా

వ్యత్యాసం ఉంటే చర్యలు తప్పవు


నల్లజర్లలో రేషన్ షాపు తనిఖీ చేస్తున్న నాగాంజనేయులు

నల్లజర్ల: రేషన్ షాపులు, గ్యాస్ ఏజెన్సీల్లో వ్యత్యాసం ఉంటే చర్యలు తప్పవని సివిల్ సప్లయిస్ ఏఎస్‌ఓ నాగాంజనేయులు హెచ్చరించారు. నల్లజర్ల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన యాప్ ద్వారా రేషన్ షాపులపై నిరంతర తనిఖీ ఉంటుందన్నారు. ఎండీయూ ఆపరేటర్లు ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుంచి ప్రజలకు సరకులు అందించాల్సి ఉంటుందన్నారు. అనంతరం సీతారామ గ్యాస్ ఏజెన్సీని పరిశీలించారు. అనంతరం నల్లజర్లలో రేషన్ డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి నెలా తహసీల్దార్ 4 షాపులు పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్ఎస్ నాయుడు, సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ, వీఆర్వో మూర్తి, ఏఆర్ఏ సర్దార్ ఉన్నారు.

తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదించాలి


ఉండ్రాజవరంలో తెలుగు భాష విశిష్టతను వివరిస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణప్రసాద్

ఉండ్రాజవరం: తెలుగు భాష మన మాతృ భాష అయినందుకు గర్వపడుతూ అందులోని మాధుర్యాన్ని విద్యార్థులు ఆస్వాదించాలని మోర్త ఉన్నత పాఠశాల తెలుగు భాషోపాధ్యాయుడు చెరుకూరి వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరంలోని సహజ యోగ ధ్యాన కేంద్రంలో విద్యార్థులకు మంగళవారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్ ప్రతి రోజు పలు అంశాలు వివరిస్తూ భాషాభిరుచిని కలిగిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్‌ను సెంటర్ కోఆర్డినేటర్ బి.సాయిశేఖర్, సెంటర్ కోఆర్డినేటర్ సహజ యోగి ఉమాశంకర్, ఆకెళ్ల శ్రీనివాసరావు అభినందించారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి

నిడదవోలు రూరల్: ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం వివిధ అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందిస్తున్న ప్రభుత్వం క్యూర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల వద్ద క్యూర్ కోడ్ బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టం నిర్వీర్యం

నిడదవోలు: ప్రభుత్వాలు, కోర్టులు తీసుకునే నిర్ణయాల వల్ల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నిర్వీర్యమై దళితులు న్యాయం పొందడంలో నిరాదరణకు గురవుతున్నారని సత్యచంద్ర విమర్శించారు. నిడదవోలు ఏబీఎస్ టౌన్ హాల్‌లో న్యాయవాది మెన్నపు సుధాకర్ అధ్యక్షతన అట్రాసిటీ చట్టానికి అణువణువునా తూట్లే అనే అంశంపై మంగళవారం చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సత్యచంద్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల అమలులో జరుగుతున్న లోపాలను వివరించారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, న్యాయవాది నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెరవలి: తీపర్రు గ్రామానికి చెందిన బాలిక (14) కనిపించటం లేదని అందిన ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదు చేసామని ఎస్సై యం వెంకటేశ్వరరావు తెలిపారు. తీపర్రు గ్రామానికి చెందిన కర్రి గోవిందు కుమార్తె (14) ఈనెల 19వ తేదీ రాత్రి 10 గంటలకు కాలకృత్యాలు తీర్చుకుంటానని ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. బాలిక తండ్రి ఆమె ఆచూకీ కోసం గాలించి ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారని, దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసామని తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు పెరవలి పోలీస్ స్టేషన్ నంబర్లకు 94407 96642 లేక 91548 75611 ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

వేలివెన్నులో టీడీపీ మినీ మహానాడు

ఉండ్రాజవరం: వేలివెన్ను రైతు సంఘం భవనంలో నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహించారు. ఈ మినీ మహానాడులో పార్టీ శ్రేణులు నాలుగు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలి

కొవ్వూరు చౌక ధరల దుకాణంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


కొవ్వూరులో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీవో

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరును క్షేత్రస్థాయి పర్యటన సందర్భంలో తనిఖీ చెయ్యాలని కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం కొవ్వూరు పట్టణ ప్రాంతాల్లోని చౌక ధరల దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. అక్కడ వినియోగదారులతో మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరు, మోటార్ డెలివరీ యూనిట్స్ ద్వారా ఇంటి వద్దనే సరుకుల పంపిణీపై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పౌర సేవలు అందించే క్రమంలో క్షేత్రస్థాయిలో ఆయా వ్యవస్థల పనితీరుపై జిల్లాస్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత తనిఖీ చేసిన స్టాక్ వివరాలు తెలియజేస్తూ ప్రజా పంపిణీ వ్యవస్థ, ఐసీడీఎస్ ద్వారా ఏంఎస్ఎల్ పాయింట్‌లో స్టాక్ స్పోర్టెక్స్ రైస్ 19,245 సంచుల్లో 959.328 మెట్రిక్ టన్నులు, ఫోర్టిఫైడ్ రైస్ 14.244 మెట్రిక్ టన్నులు, చక్కెర 58.494 మెట్రిక్ టన్నులు, కందిపప్పు పీడీఎస్, ఐసీడీఎస్‌లు 11.882 మెట్రిక్ టన్నులు, పీడీఎస్ 2.427 మెట్రిక్ టన్నులు పామ్‌ఆయిల్ 1,049 లీటర్ ప్యాకెట్లు, 7,219 అర లీటర్ ప్యాకెట్లు స్టాక్ మేరకు సరిపోయినట్లు తెలిపారు. ఆ మేరకు కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

చాగల్లు: సివిల్ సప్లయ్ మండల స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న సరుకుల స్టాక్ వివరాలను, రిజిస్టర్లను, డీలర్ల పనితీరును క్షేత్రస్థాయి పర్యటన సందర్భంలో అధికారులు తనిఖీ చెయ్యాలని కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. మంగళవారం చాగల్లు మండలం ఊనగట్ల ఎమ్ఎస్ఎల్ పాయింట్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆయా వ్యవస్థల పనితీరుపై జిల్లాస్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. చాగల్లు మండలం ఊనగట్లలోనీ మండల స్టాక్ పాయింట్ నిర్వహణ విషయంలో స్టాక్ నిర్వహణ, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించామన్నారు. పరిశీలన అనంతరం నివేదిక అందజేయాలని ఆర్డీవో రాణి సుస్మితను కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత తనిఖీ చేసి మాట్లాడుతూ రికార్డుల ప్రకారమే స్టాక్ ఉన్నట్టు గుర్తించామని తెలిపారు. ఆమేరకు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు.

ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్డీవో రాణి సుస్మిత, చాగల్లు తహసీల్దార్ ఎం.మెరికమ్మ, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం


ఫిర్యాదీలతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్‌ఐ, వీఆర్వోలు

నల్లజర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్టు తహసీల్దార్ ఎస్.వి.ఎస్.నాయుడు తెలిపారు. అనంతపల్లిలో వచ్చిన మూడు అర్జీలను మంగళవారం పరిష్కరించినట్టు చెప్పారు. అనంతపల్లిలో చింతాడ నాగలక్ష్మి చికెన్ షాపు ఎదురుగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ ముదుసలి అయిన అత్త గారిని వీధిలోకి గెంటియ్యడంతో కొంతకాలంగా అత్తాకోడళ్ల మధ్య తగవులు జరుగుతున్నాయి. ఈ విషయంపై అత్త చింతాడ లక్ష్మి సోమవారం మండల కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో తహసీల్దార్, ఎంపీడీఓ సింహాద్రి, ఎస్‌ఐ సత్యనారాయణ బాధితురాలి ఇంటికి వెళ్లి కోడలితో మాట్లాడారు. బెల్ట్ షాపు మూసివేయాలని, అత్తను సవ్యంగా చూసుకోవాలని ఈ విషయమై మరోమారు ఫిర్యాదు వస్తే సహించబోమని హెచ్చరించారు. చోడవరం రోడ్డులో గన్నమని సూర్యచంద్రరావు, అవిర్ని రామచంద్రరావుల మధ్య దారి వివాదాన్ని పరిష్కరించారు. ఆ పక్కనే ఉన్న భోగవల్లి శ్రీనివారావు సరిహద్దు వివాదాన్ని పరిష్కరించారు. వీఆర్వో కిరణ్, గ్రామమహిళా సంరక్షణాధికారి కనకదుర్గ,గ్రామ కార్యదర్శి వి.శ్రీదేవి పాల్గొన్నారు.

చిన్నారుల నైపుణ్యాలకు పదునుపెట్టాలి


దూబచర్లలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ శేషగిరి

నల్లజర్ల: వేసవి సెలవులు వృథా కానీయకుండా చిన్నారులు తమలోని నైపుణ్యాలకు పదును పెట్టాలని స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ ఎం.శేషగిరి అన్నారు. దూబచర్ల సంఘమిత్ర స్కూలులో ఈనెల ఒకటో తేది నుంచి నిర్వహిస్తున్న యోగా, చెస్, వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఉదయం ఆయన సందర్శించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లతో విలువైన సమయం వృథా అవుతుందని వాటికి దూరంగా ఉండాలన్నారు. జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాన్ని సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించేలా క్రీడా స్ఫూర్తిని అలవాటు చేసుకోవాలన్నారు. ఈ తరహా శిక్షణ శిబిరాలు బాలబాలికలలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. శిబిరాన్ని నిర్వాహకుడు యోగా గురువు రాజారావును అభినందించారు. శిబిరానికి సహకరిస్తున్న సంఘమిత్ర స్కూల్ డైరక్టర్ అంబటి శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులతో పాటు చీమకుర్తి కృష్ణప్రసాద్ హాజరయ్యారు.

కార్మికుల హక్కులను రద్దు చేయడం తగదు


తాళ్లపూడిలో నిరసన తెలుపుతుపుతున్న సీఐటీయూ నాయకులు

తాళ్లపూడి: ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీసం నెలకు రూ.26,000 చెల్లించాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, యానిమేటర్లు వంటి స్కీం వర్కర్లందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, రైతుల పంటల గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజు వేతనం 600 చెల్లించాలని డిమాండ్ చేస్తూ తాళ్లపూడిలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా కార్మికులకు లభించిన హక్కులను రద్దు చేస్తున్నారని ఆరోపించారు. జూలై 9న దేశవ్యాప్తంగా 11 జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపుని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుంకర వెంకటేశ్వరరావు, రెడ్ల రాజు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: కట్టుకున్న భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై కె.వీరబాబు మంగళవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని సమిశ్రగూడెంకు చెందిన మెల్లిమి శిరీషకు రామకృష్ణ అనే వ్యక్తికి ఐదేళ్ల క్రితం వివాహమైందని, వీరికి ఇద్దరు పిల్లలున్నారన్నారు. కొంతకాలంగా తన భర్త రామకృష్ణతో పాటు అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు శిరీష ఇచ్చిన ఫిర్యాదుపై ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరబాబు పేర్కొన్నారు.

ఆలయాల భూముల కౌలు వేలం


తీపర్రులో దేవాలయాల భూములను వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పెరవలి: తీపర్రులోని వివిధ దేవాలయాలకు చెందిన పంట భూములను మూడేళ్ల కాలపరిమితికి సాగు చేసుకోవటానికి వేలం నిర్వహించగా గతంలో కంటే అధిక ఆదాయం వచ్చిందని ఆలయాల ఈఓ ఎంవీ రామయ్య తెలిపారు. తీపర్రులోని ఈడ్పుగంటి రత్తమ్మ ధర్మసత్రంలో నిర్వహించిన ఈ వేలంలో శ్రీ లక్ష్మీ నర్శింహస్వామి దేవాలయానికి చెందిన 13 ఎకరాల 23 సెంట్లు భూమిని ఏడు భాగాలుగా వేలం పాట నిర్వహించారు. వీటికి ఏడాదికి శిస్తు రూ.7.5 లక్షలు చెల్లించేలా పాట ఖరారైందని, గతంలో రూ.5.69,300 లక్షలు ఆదాయం వచ్చేదని ఈవో తెలిపారు. ఈ వేలంలో గతం కంటే రూ.1.35,700 ఆదాయం పెరిగిందని ఆయన తెలిపారు. ఈడ్పుగంటి రత్తమ్మ సత్రానికి చెందిన 88 సెంట్ల భూమికి వేలం ద్వారా రూ.31 వేలు ఆదాయం వచ్చిందని, గతంలో రూ.29 వేలు ఆదాయం వచ్చేదని తెలిపారు. రాజరాజ నరేంద్ర స్వామి ఆలయానికి చెందిన 11 ఎకరాల 12 సెంట్ల భూములకు రూ.3.28 లక్షలు చెల్లించేలా వేలం ఖరారైందని, గతంలో రూ.3.22 లక్షలు ఆదాయం వచ్చేందని తెలిపారు. ఈ వేలంలో గ్రామస్తులు, నాయకులు కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, మొగలపు సీతారాం, బలుసు రంగారావు, నందమూరి నారాయణరావుతో పాటు కాపవరం, ఉసులుమర్రు, తాడిపర్రు, కాకరపర్రు, వెలగదుర్రు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

వీఆర్వోల నిరసన


నిడదవోలు తహసీల్దార్ నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

నిడదవోలు రూరల్: రెండు సచివాలయాలను క్లస్టర్‌గా నిర్ణయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 4ను రద్దు చేయాలని వీఆర్వోల సంఘం కొవ్వూరు డివిజన్ అధ్యక్షుడు ఏజర్ల ప్రభాకరరావు డిమాండ్ చేశారు. జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిడదవోలు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్‌కు మంగళవారం వీఆర్వోలు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ రెండు సచివాలయాలకు ఒక వీఆర్వో నియమించడం వల్ల రీ సర్వే, రెవెన్యూ సదస్సులు, గ్రామ సభలు, పీజీఆర్ఎస్ ఇతర రోజువారీ రెవెన్యూ విధుల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. వీఆర్వోలపై పనిభారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

దేవరపల్లి: దేవరపల్లిలో సారా అమ్ముతున్న తంగెళ్ల మునిస్వామి అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్, ప్రొహిబిషన్ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. అతడి నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో సారా, మద్యం అక్రమ అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడికి ఆర్థిక సాయం


పెద్దేవంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: పెద్దేవంలోని 5వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బొర్రా సూరిబాబు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అనారోగ్యం పాలయ్యారు. మంగళవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు గ్రామ కమిటీ తరపున రూ.45 వేలు ఆర్థిక సాయం అందజేసారు. సూరిబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివ్ సెక్రటరీ వంబోలు పోసిబాబు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు కవల నాగేశ్వరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బట్టు సుబ్బారావు, నాయకులు నల్లాకుల వేణుగోపాలకృష్ణ, మైలవరపు రాధాకృష్ణ, కోడి గంగారావు, చింతా వెంకటస్వామి పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి


నిడదవోలులో ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నిడదవోలు: కార్మిక హక్కులు హరించే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని గణపతి సెంటర్‌లో సీఐటీయూ మండల కమిటీ అధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంటి కృష్ణ, జి.డేనియల్, యర్రా శ్రీను, రసూల్, గోపి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

చాగల్లు: గోదావరి నదిలో సీతంపేట వద్ద స్నానాలకు ఎవరూ వెళ్లకుండా, ప్రమాదాల నివారణకు కంచె ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గాలింకి రాము డిమాండ్ చేశారు. చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన గాడి శ్రీను కుమారుడు గాడి రాకేష్ అనే యువకుడు గోదావరి నదిలో సీతంపేట వద్ద వాగులు వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి గోదావరిలో పడి మరణించడం చాలా బాధాకరమన్నారు. పేద కుటుంబానికి రాకేష్ తండ్రి పక్షవాతంతో బాధపడుతున్నాడని అన్నారు. అదే కాకుండా రాకేష్ అన్నయ్య శారీరక, మానసిక వికలాంగుడని, తన అక్కని రాకేష్ చదివిస్తూ తను తాపీ పని చేసూ కష్టార్జితంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడని అన్నారు. ఇప్పుడు రాకేష్ మరణంతో కుటుంబం పరిస్థితి చిన్నాభిన్నమైందని వారన్నారు. ప్రభుత్వం స్పందించి రాకేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నదిలో బ్యారేజ్ దిగువ భాగంలో స్నానానికి వచ్చి ఎంతోమంది ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి, దుద్దుకూరు గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దేవరపల్లిలో మూడు, దుద్దుకూరులో ఒక దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణాల్లోని సరుకులను తనిఖీ చేసి, నిల్వలను పరిశీలించారు. ఈ–పోస్ యంత్రంలోని నిల్వలకు, దుకాణాల్లోని నిల్వలు సరిపోయాయని, ఎటువంటి వ్యత్యాసాలూ లేవని తెలిపారు. తనిఖీల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి నాగాంజనేయులు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు. దుకాణాలను పరిశుభ్రంగా ఉంచాలని, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ప్రజలకు రేషన్ సరకులు సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు.